కదం తొక్కి.. రైతన్నకు అండగా నిలిచి..

తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

అమలాపురం రూరల్/ఉప్పలగుప్తం: రైతుల సమస్యలపై అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో అమలాపురం నియోజకరవర్గం నుంచి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద అమలాపురం నియోజవర్గ పరిధిలోని అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం ఉప్పలగుప్తం మండలాల పరిధిలో పార్టీ శ్రేణులు, రైతులు నల్లవంతెన నుండి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో మదన్‌మోహన్‌రావుకు వినతి పత్రం అందించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.20 వేలు సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు సంసాని బుల్లి నాని, బొంతు గోవిందశెట్టి, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, ఎంపీపీలు కుడిపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషారావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి, నేల కిషోర్, గన్నవరపు శ్రీనివాస్, బుడిద వరలక్ష్మి, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, మోటూరి సాయి, కడిమి చిన్నవరాజు, కుంచే రమణారావు, పినిపే జయరాజు, జాన గణేష్, సలాది సతీష్, సూదా గణపతి, యర్రంశెట్టి రామచంద్రరావు, యనమదల పల్లంరాజు, మోటూరి సత్యం కాపు, ఓగూరి విజయ్‌కుమార్, బడుగు మేరి, దంగేటి రుద్ర, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, గోపి రాజారమేష్, దుర్గాబాయ్, కేతా భానుతేజ. జంపన గణేష్ వర్మ, తిరుకోటి సతీష్, ఈతకోట శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న పార్టీ నాయకులు



అమలాపురంలో కలెక్టరేట్ వద్ద సమావేశమైన పార్టీ శ్రేణులు

క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



తాడికోన డ్రెయిన్ గట్టుపై ఒరిగిన కరెంట్ స్తంభాలు

అల్లవరం: తాడికోన-డి.రావులపాలెం గ్రామాల మధ్య డ్రెయిన్ గట్టుపై ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. డి.రావులపాలెం రెవెన్యూ పరిధిలో సత్తెమ్మ తాడిచెట్టు వద్ద మూడు కరెంట్ స్తంభాలు డ్రెయిన్ వైపు వాలిపోయాయి. స్తంభాలు ఒరిగిపోవడంతో కరెంట్ తీగలు వేలాడుతూ ప్రమాదకంగా మారాయని స్థానిక ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక లైన్‌మన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి, ఒరిగిన కరెంట్ స్తంభాలను సరిచేయించాలని కోరుతున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా సుస్మిత నృత్య ప్రదర్శన



యువ ఉత్సవ్‌లో ప్రదర్శన ఇస్తున్న లక్ష్మీసుస్మిత

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న యువ ఉత్సవ్‌లో భాగంగా సాంస్కృతిక ఉత్సవ విభాగంలో ఆదుర్తి లక్ష్మీసుస్మిత ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమలాపురం వేంకటేశ్వర డిగ్రీ కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న సుస్మిత, భవాని, హేమ బృందం యువ ఉత్సవ్‌లో రామాయణ శబ్దం అనే అంశంపై కూచిపూడి నృత్యం ప్రదర్శించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. కూచిపూడి నృత్యంలో లక్ష్మీ సుస్మిత.. భారత్ బాలశ్రీ, నాట్య యశస్వి, వేంగి కళాశ్రీ, నాట్య విపంచి, నాట్య సౌగంధి, బిరుదులను పొందిందని ఆమె తండ్రి, ఉపాధ్యాయుడు అప్పారావు శుక్రవారం తెలిపారు. కూచిపూడి నృత్యంలో గతంలో భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన లక్ష్మీ సుస్మిత బృందం త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేయనున్నారు.

నందీశ్వరునికి అభిషేకం



నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెంలో ఉన్న పురాతన శివాలయంలో పవిత్ర త్రయోదశి సందర్భంగా నందీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. స్థానిక భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీకంఠం భీమేశ్వరశర్మ, ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు చేసి, వివిధ అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మంగమ్మ(ఫైల్)

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ పరిధి బాబానగర్‌లో జొన్నలగడ్డ మంగమ్మ(102) శుక్రవారం కన్నుమూశారు. కాజులూరు మండలానికి చెందిన మంగమ్మ తన భర్త జొన్నలగడ్డ రామారావు 40 ఏళ్ల క్రితం మరణించడంతో సుంకరపాలెం బాబానగర్‌లో వారి కుమార్తె వడ్డి కాంతమ్మ ఇంటికి వచ్చేశారు. కాంతమ్మ కుమారుడు విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు తన అమ్మమ్మను ఆప్యాయంగా చూసుకున్నారు. 1920లో కాజులూరు మండలం పొలమూరుపాడు గ్రామంలో జన్మించిన ఆమెకు 12వ ఏటనే కోలంక గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రామారావుతో వివాహమైంది. పెళ్లయిన 12 ఏళ్ల తరువాత కుమార్తె జన్మించింది. నిత్యం మంగమ్మ ఉదయం 5 గంటలకు నిద్రలేచి, నిర్ణీత సమయానికే ఆహారం, నిద్రకు ఉపక్రమించేవారు. కనీసం కళ్లజోడు, చేతికర్ర కూడా లేకుండా తన పనులు చేసుకునేవారు.

అల్లు అర్జున్ అరెస్టు అక్రమం

కాట్రేనికోన: హీరో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం అక్రమమని కాట్రేనికోనకు చెందిన, పుష్ప1, 2 సినిమాల్లో నటించిన సురేష్‌శర్మ తీవ్రంగా ఖండించారు. థియేటర్ వద్ద తొక్కిసలాటలో మహిళ మృతిపై అల్లు అర్జున్ ప్రమేయం నేరుగా లేకున్నా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని అల్లుఅర్జున్ సినీయూనిట్ భరోసా ఇచ్చిందన్నారు. అల్లు అర్జున్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమన్నారు.

సాగు నీటి సంఘాలకు నేడు ఎన్నికలు



ముమ్మిడివరంలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

అల్లవరం: మండలంలోని దేవగుప్తం, బెండమూర్లంక, తాడికోన, గోడిలంక, కొమరగిరిపట్నం సాగు నీటి సంఘాలకు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం ఎన్నికలు జరగనున్నాయని తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు శుక్రవారం తెలిపారు. మండలంలో 13,962 మంది రైతులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందని ఓ ప్రకటనలో చెప్పారు. రైతులు 1బీ లేదా పాస్ బుక్ లేదా వీఆర్వోతో ధ్రువీకరించిన పత్రంతో ఓటు వేసేందుకు రావాలని సూచించారు.

సాగు నీటి సంఘాలు	ఎన్నిక జరుగు ప్రాంతం
దేవగుప్తం	దేవగుప్తం జెడ్పీ హైస్కూల్
బెండమూర్లంక	బెండమూర్లంక ఎంపీపీ పాఠశాల
తాడికోన	తాడికోన యూపీ పాఠశాల
గోడిలంక	గోడిలంక జెడ్పీ హైస్కూల్
కొమరగిరిపట్నం	కొమరగిరిపట్నం హైస్కూల్

పారదర్శకంగా నిర్వహించాలి

ముమ్మిడివరం: నీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ టి.వెంకటాచార్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచార్యతో పాటు, తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ శ్రీలేఖ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోపాలకృష్ణ, ఈఓపీఆర్డీ లక్ష్మీ కల్యాణి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలించిన బృందం

యానాం: ఫెంగల్ తుపాను వల్ల భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని కారైకల్ నుంచి యానాం శుక్రవారం వచ్చిన వ్యవసాయాధికారుల బృందం పరిశీలించింది. ఈ బృందం వరిచేలను, అపరాల పంటల నష్టాన్ని అంచనా వేయడానికి క్షేత్రస్థాయిలో పర్యటించింది. దరియాలతిప్పలో వరిచేలను పరిశీలించి నష్టాన్ని రైతుల ద్వారా తెలుసుకుంది. పరంపేటలో అపరాల పంటలను పరిశీలించింది. బృంద సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ వి కృష్ణన్, పి శరవణన్, కె కుమారవేల్, ఆర్ తమిళసెల్వన్, ఎ కార్మిల్ రీతా, అరవింద్, బి గోబు, వ్యవసాయాధికారి జోగిరాజు, ఫీల్డ్‌మెన్ ఐకే ఖాన్, రూప, చినబాబు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దరియాలతిప్పలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న బృందం

మానవాళి రక్షకుడు ఏసుక్రీస్తు

ఉప్పలగుప్తం: సర్వ మానవాళి రక్షకుడు ఏసుక్రీస్తు అని ఆయన మార్గం అనుసరణీయమని సర్పంచ్ సలాది ఊర్మిళదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో ప్రవచన దేవుని సంఘం ప్రార్థన మందిరంలో శుక్రవారం స్థానిక సంఘ పాస్టర్ టీకేవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సర్పంచ్ సలాది ఊర్మిళదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ దంపతులు పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిషప్ జి.అబెద్నగో క్రీస్తు జనన మరణ పునరుత్థానం ప్రాముఖ్యాన్ని వివరించారు. సిస్టర్ టి.దీవెనకుమారి, సంఘ పెద్దలు, విశ్వాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విలసవిల్లిలో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

15న జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి సహకార శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి ఈ నెల 15న జరిగే రాత పరీక్షకు 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డిపార్ట్‌మెంట్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ శాఖ అధికారి పంకజ్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే 6,542 మంది అభ్యర్థులకు యానాం 1, పుదుచ్చేరి 15, కారైకల్ 2, మాహే 1 కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అడ్మిట్ కార్డు ఉన్నవారినే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు తదితర వాటిలో ఏదైనా ఒక ఒరిజినల్ కార్డు తేవాలని కోరారు. ఉదయం 9.30 తర్వాత పరీక్ష కేంద్రంలో అనుమతి ఉండదన్నారు.

సాయంత్రం వేళల్లో ఓపీడీ సేవలు

యానాం: యానాం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ నెల 16 నుంచి సాయంత్రం వేళల్లో సైతం ఓపీడీ సేవలు అందుబాటులో ఉంటాయని జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.రవిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు సాయంత్రం 5 నుంచి రాత్రి 7.30 వరకు ఓపీడీ సేవలు ఉంటాయని చెప్పారు.

గ్రాండ్ మాస్టర్‌కు చిత్రాభినందన



ఆకొండి గీసిన గుకేష్ చిత్రం

కాట్రేనికోన: సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీలలో విజేతగా నిలిచిన ఇండియా గ్రాండ్ మాస్టర్ డి.గుకేష్ 18 ఏళ్లకే ప్రపంచ చాంపియన్‌గా అవతరించడాన్ని అభినందిస్తూ ఆయన చిత్రాన్ని కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకొండి అంజి గీశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, దేశానికి ఖ్యాతి తేవాలని ఆయన ఆకాంక్షించారు.

రెవెన్యూ సదస్సులో అధికారులతో వాగ్వాదం

అల్లవరం: భూ సమస్యలపై బోడసకుర్రులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులు, అర్జీదారుని మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బోడసకుర్రు పల్లిపాలానికి చెందిన గ్రామ కంఠం భూమిపై పరమేష్ రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. తాను ఇచ్చిన ఫిర్యాదుకు రసీదు కావాలని తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావును కోరారు. రసీదు ఇవ్వడం జరగదని తహసీల్దార్ చెప్పడంతో, పరమేష్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో తహసీల్దార్ ఆర్డీఓ, జేసీ దృష్టికి తీసుకెళ్లగా, స్పందనలో రసీదు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో వివాదం సర్దుమణిగింది. బోడసకుర్రు సచివాలయం వద్ద జరిగిన ఈ సదస్సులో 26 ఫిర్యాదులు అందాయి. తహసీల్దార్ అధ్యక్షత వహించారు. మండల ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి మాట్లాడుతూ దీర్ఘ కాలికంగా పరిష్కారం కాని భూ సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, ఆర్ఐ మన్యం, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

తాళ్లరేవు: భూ సమస్యలకు రెవెన్యూ సదస్సులతో పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శుక్రవారం పటవల పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి సునీత మాట్లాడుతూ, భూ యజమానులకు ఎటువంటి భూ సమస్యలున్నా పరిష్కరిస్తారన్నారు. తహసీల్దార్ త్రినాథరావు మాట్లాడుతూ, భూ సమస్యలతో పాటు, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి సమస్యల అర్జీలనూ స్వీకరిస్తారని తెలిపారు. అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని, అన్యాక్రాంతమైన భూములను అర్హులైన పేదలకు అందజేయాలని సీపీఎం నాయకుడు టి.ఈశ్వరరావు వినతిపత్రం అందజేశారు. 16 అర్జీలందాయి. పంచాయతీ కార్యదర్శి అర్దాని రామరాజు, డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు, రీసర్వే డీటీ వీరబాబు, ఆర్ఐ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో మరణించిన అమలాపురం రూరల్ బండారులంకకు చెందిన బట్టు నాగమల్లేశ్వరరావు(పండు) కుటుంబానికి అతడి మిత్ర బృందం ఆర్థికసాయాన్ని అందించింది. బండారులంక జెడ్పీ హైస్కూల్‌లో 1994-95 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.1.05 లక్షలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి వారి కుటుంబ సభ్యులకు పత్రాలను అందజేశారు.



పండు కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న మిత్ర బృందం

పల్లె బాట.. నీళ్లమూట

- అభివృద్ధికి నోచుకోని గ్రామీణ రహదారులు
- అధ్వానంగా నీళ్లరేవు–కాట్రేనికోన రోడ్డు
- కొత్తవి వేస్తామంటూ ఎన్నికల్లో ఓట్లు దండుకున్న కూటమి నేతలు
- అధికారం చేపట్టాక పట్టించుకోని వైనం

కాట్రేనికోన: ప్రతి పల్లెకు రోడ్లు వేసి అభివృద్ధి చేసి చూపిస్తామన్న కూటమి నేతలు.. తీరా అధికారం చేపట్టాక ఛిద్రమైన రోడ్లను గాలికి వదిలేశారని పలువురు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా.. కనీసం గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్లను సైతం అభివృద్ధి చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన రోడ్లు మినహా.. కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన-ముమ్మిడివరం, కాట్రేనికోన-నీళ్లరేవు రోడ్లు గోతులతో దిగబడిపోయాయి. ఆయా రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలకు కళ్లముందు నరకం కదలాడుతోంది. మహిళలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఆటోలపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఆటోలలో ప్రయాణించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లరేవు, అయినాపురం మీదుగా కాట్రేనికోన-ముమ్మిడివరం రోడ్డు గోతులమయం కావడంతో అత్యవసర సర్వీసులు 108, 104 వంటి వాహనాలు సైతం రావడం ఆలస్యం కావడంతో పాటు. తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దిగబడిన రోడ్డులో ఆసుపత్రికి అంబులెన్స్‌లో ప్రయాణం రోగులకు ప్రాణసంకటంగా మారిందని అంటున్నారు.



చిర్రయానం వద్ద ఛిద్రమైన నీళ్లరేవు వెళ్లే రోడ్డు

ఏరు దాటి..

ఎన్నికల ముందు కూటమి నాయకులు గ్రామాలలో తిరుగుతూ తమకు ఓటు వేసి గెలిపిస్తే.. అధికారం చేపట్టిన తక్షణమే ఈ రెండు రోడ్ల పనులు చేపడతానని చెప్పారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. తీరా అధికారం చేపట్టిన తరువాత ఏరుదాటి తెప్ప తగలేసిన చందాన కనీసం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని పెదవి విరుస్తున్నారు.

ప్రజలకు ఉపయుక్తం

చిర్రయానం రోడ్డు పనులకు ఆగమేఘాల మీద మండల పరిషత్ తీర్మానం చేయించి గమ్మున ఉండిపోయారని పలువురు అంటున్నారు. నీళ్లరేవు-కాట్రేనికోన రోడ్డు వెంబడి చిర్రయానం, గచ్చకాయలపోర, నాగపట్టణం, మర్రిచెట్టు కాలనీ, కాపులపాలెం, రాజానగరం, సత్తమ్మ చెట్టు, రేవువారిపేట, వేట్లపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతి రోజు మండల కేంద్రమైన కాట్రేనికోన, అమలాపురం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **రహదారి పనులు చేపట్టాలి**
>
> ముమ్మిడివరం-కాట్రేనికోన రోడ్డు గోతులు పడి దిగబడిపోయింది. మోటారు సైకిళ్లపై కాట్రేనికోన నుంచి ముమ్మిడివరం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి.
>
> – జి.బోసు, కాట్రేనికోన

ప్రతిభ, దేశభక్తిని పెంపొందించే యువ ఉత్సవ్

జేసీ రాహుల్ మీనా

తాళ్లరేవు: యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు యువతలో ప్రతిభను వెలికితీసేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని కాకినాడ జేసీ రాహుల్ మీనా అన్నారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం పటవల పైడా కళాశాలలో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ యువత సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు మరింత పట్టుదలతో కృషి చేసి, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని కోరారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి దూలం కిషోర్ మాట్లాడారు. ఈ సందర్భంగా యువ ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన మెడికల్, డీఆర్డీఏ, అగ్నిమాపక తదితర శాఖల స్టాళ్లను జేసీ పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ నిత్యా శ్రీరామ్, ఇంక్యుబేషన్ డైరెక్టర్ వంశీ, ప్రిన్సిపాల్ పీవీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నమూనాలను తిలకిస్తున్న జేసీ రాహుల్ మీనా

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం



హనుమద్వ్రతాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

యానాం: హనుమాన్ వ్రతాన్ని పురస్కరించుకుని యానాంలో శుక్రవారం పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. దొమ్మేటిపేట గ్రామంలో కనకదుర్గాదేవి ఆలయంలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమద్వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతాభిషేకం, అభిషేకాలు, సింధూరం, తమలపాకు పూజలు జరిగాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. శివాలయ ఆవరణలో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రతం ఘనంగా జరిగింది.

ఘనంగా హనుమద్వ్రత మహోత్సవాలు

అమలాపురం టౌన్: పట్టణంలోని యర్రమల్లి వారి వీధిలోని సకల కార్యసిద్ధి మరకత హనుమాన్ మందిర్ వద్ద వారం రోజులుగా హనుమద్వ్రత మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీరామ పట్టాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించి, హనుమద్వ్రత కథ ప్రవచనం చేశారు. అనంతరం లక్ష తులసి పూజ కన్నుల పండువగా సాగింది. వివిధ క్రతువులను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 108 సుందర కాండ పారాయణాలు నిర్వహించిన సందర్భంగా సామూహిక సుందరకాండ గ్రంథ పూజా కార్యక్రమం జరిగింది. మందిర్ ప్రతినిధి, సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో కిమ్స్ వైద్య కళాశాల ఏవో కె.రఘు, వైఎస్సార్ సీపీ నేత కుడుపూడి భరత్ భూషణ్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనవరి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

యానాం: జనవరి నెల నుంచి రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఎరుపు రంగు రేషన్‌కార్డుకు 20 కేజీలు, పసుపు రంగు కార్డుకు 10 కేజీల చొప్పున బియ్యం పంపిణీ జరగుతుందన్నారు. కొన్నేళ్లుగా నిలిచిపోయిన పథకాలను ప్రజా ఉత్సవాలకు వచ్చే సీఎం రంగసామి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులపై దాడికి నిరసనగా ధర్నా



ముమ్మిడివరంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

ముమ్మిడివరం: జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ముమ్మిడివరం ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ధర్నా చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడి హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. హైదరాబాద్‌లో విలేకరిపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాకు జనసేన నాయకుడు గుద్దటి జమి మద్దతు పలికారు. నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

అమలాపురం టౌన్: పట్టణంలోని శ్రీకామాక్షీ పీఠంలో అనాథ పిల్లలు పెరిగే ప్రేమ మందిరానికి అంతర్జాతీయ వాకర్స్ కో-ఆర్డినేటర్ తేతల సత్యనారాయణ రెడ్డి నిత్యావసర వస్తువులను శుక్రవారం అందించారు. అనంతరం కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ ఏరియా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. సత్యనారాయణ రెడ్డి జన్మదినం సందర్భంగా పీఠంలో ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు.